# అదీ సంగతి!?

మనిషి జన్మకి మూడు మరణాలు అని ఎవరో అన్నారు. మొదటిది సంతానం మూలంగా సమాజంలో అవమానం పొందడం. రెండవది ఉద్యోగం జీవితంలో పదవీ విరమణ చేయడం, మూడవది ఈ లోకాన్ని వదిలి శాశ్వతంగా వెళ్ళిపోవడం.

ఇంతకీ విషయమేమిటంటే మా ఆఫీసులో ఇంజనీరుగారి తరువాత పెద్ద అధికారి, మేనేజరుగారు రిటైర్‌మెంట్ ఆ రోజున.

ఆయన తన ఛాంబర్‌లో కూర్చుని, రిఫరెన్సులు డిస్పోజ్ చేయలేదని రేపటినుండి ఎవరిని వేధించాలి, టైముకు వంట చేయలేదని కనీసం ఆ ఒక్క కారణం మీదైనా తన గయ్యాళి భార్యను సతాయించగలుగుతున్నాడు, రేపటినుండి 'ఇంట్లో పడి ఉండండి నోరు మూస్కుని' అంటుందేమో, ఏమిటో రేపటినుండి ఇంట్లో సేవకులు ఉండరు. బజారుకు చేతిసంచీ పుచ్చుకుని సరుకులకు వెళ్ళాలి. రోజూ ఎంతటి రాజభోగం? రోడ్డు ఎక్కితే చాలు ఎన్ని నమస్కారాలు? ఎన్ని మర్యాదపూర్వక పలకరింపులు? "మే ఐ కమిన్ సర్?" అంటూ రోజూ స్ప్రింగ్ డోర్ తెరుచుకుని తన ఛాంబర్‌లోకి ఎంతమంది వస్తుంటారు? ఏమిటో ఆయన మనసంతా మంత్రి పదవికి రాజీనామా చేసిన మంత్రిలా గిలగిలా కొట్టుకుంటోంది. ఇంతలో గుంపుగా ఆఫీసు స్టాఫ్ తన గదిలోకి వచ్చేశారు.

"సార్ రాత్రికి మీకు జయా రెసిడెన్సీలో డిన్నర్ ఏర్పాటు చేశాం. సాయంకాలం తమరింటికి వచ్చి తీసుకెళ్తాం –" అంటున్నాడు సూపర్నెంటు.

అతని చూపుల్లో 'పీడి పీడ విరగడైంది. రోజు ఆఫీసుకు రావడం ఆలస్యం కేష్ ఎంతుంది? అంటూ తన పాకెట్ మనీలా ఖర్చుపెట్టేసుకుంటూంటాడు. నెలాఖరులో పెట్టేస్తాడనుకో కాని ఈలోగా ఎవరైనా పై అధికారులు క్యాష్ చెక్ చేస్తారేమోనన్న భయంతో తన స్వంత డబ్బు పెడుతూంటాడు. లేకపోతే కొంప కొల్లేరే!'

"ఎందుకయ్యా చిన్న పార్టీ పెట్టకపోయారా డబ్బు ఖర్చు గదా..' అన్నారు మేనేజరుగారు. "మీరంటే మాకు ఎంతో గౌరవం సర్. మళ్ళీ మీలాంటి మర్యాదస్తుల్ని చూడగలమా?" అంటోంది గిరజాలజుట్టు స్టెనో కృష్ణవేణి. ఆమెను మాటిమాటికీ తన ఛాంబర్‌కి పిలిపించుకుని ఆమె రైటింగ్ బావుంటుందని ఏవేవో రాయించుకోవడం, ఆ

క్రమంలో పిచ్చి పిచ్చి సినిమా కబుర్లు చెప్పడం వెకిలిగా చూడడం పైగా మనం ఒకసారి మాంచి సినిమాకి వెళ్ళాలి కృష్ణా అనడం, 'నంగివెధవ, నెత్తిమీద నాలుగు పోగులు లేవు. ఒహటే జుట్టు సవరించుకుంటూ ఉంటాడు' అని తిట్టుకుంటూంది కృష్ణవేణి.

"ఎంత మాట సార్! మీరు అలా అనకండి. మీలాంటి ఆఫీసర్ని మేము మళ్ళీ చూడలేం" అన్నారు మిగతా వాళ్ళంతా ముక్తకంఠంతో.

వాళ్ళల్లో చాలామంది ఈ మేనేజరుగారినే 'చండశాసనుడు', 'ఎప్పుడు వదిలిపోతాడో ఈ శనిగాడు', 'జిడ్డుగాడు' అంటూ బిరుదులు కూడా ఇచ్చి సత్కరించినవాళ్ళున్నారు.

ఆయన ఎలాగూ రిటైరవుతున్నారు గదా అని ఆరోజు సిబ్బంది అంతా చాలా జాలీగా గడిపేశారు. ఎలాగూ మరొకర్ని వేసేటప్పటికి రెండునెలలు పైనే పడుతుంది. ఒక వేళ ఎవరినైనా ఇన్‌ఛార్జిగా వేసినా ఆయన అప్పుడప్పుడు వచ్చిపోతూంటాడు, జాలీగా గడిపేయవచ్చును అని అందరూ సంబరపడుతున్నారు.

ఆ రాత్రి గ్రాండ్‌గా డిన్నర్ అయింది.

అంతకుముందు జరిగిన సభలో ఒక పక్కన అందరికీ సంతోషంగా వున్నా, మేనేజరుగారు మమ్మల్ని వదిలి వెళ్ళిపోతున్నారని చాలా బాధగా ఉందనీ కొందరూ..స్వంత మనిషి వెళ్ళిపోతున్నట్లుగా బాధగా వుందని ఒకరూ రాని కన్నీళ్ళు తుడుచుకుని మరీ, కల్లబొల్లి ఏడ్పులు ఏడ్చారు. ఇదంతా నిజమనుకుని మేనేజరుగారు కూడా రెండు కన్నీటిబొట్లు వృధా చేశారు తన చివరి ఉపన్యాసంలో...

మర్నాడు ఉదయం ల ల్లలా, ల ల్లలా అని కూనిరాగాలు తీసుకుంటూ, విజిల్స్ ఊదుకుంటూ, చేతుల్లో సిగరేట్లతో పొగలు రింగులు రింగులుగా వదులుకుంటూ పదిన్నరకి బదులుగా పదకొండున్నరకి ఒక్కరొక్కరే మేనేజరు గదిలో ప్రవేశించడమూ, హతాశులవడమూ జరుగుతోంది.

కారణం!

మేనేజరుగారు చిరునవ్వులు చిందిస్తూ తన సీటులో కూర్చుని వుండగా, సూపర్నెంటు తన ముఖంలో లేని నవ్వు తెచ్చుకుని కబుర్లు చెబుతున్నాడు.

"నమస్తే సర్..." అంటూ కృష్ణవేణి వచ్చింది. 'వీడేమిటి ఇంకా ఉన్నాడు? ఈ పీనుగ శని వదిలిందనుకుంటే ఇంకా ఉన్నాడేమిటి?" అనుకుంటోంది.

"కూర్చో కృష్ణవేణి నీతో ఇంకా కొన్నిరోజులు సరదాగా గడపడానికి ప్రభుత్వం నాకు అవకాశం ఇచ్చింది అనుకో! నా పుట్టినరోజు తప్పు పడిందని ట్రిబ్యునల్‌కి వెళ్ళాననీ

నీతో ఎన్నోసార్లు అన్నాను కదా, నిన్ననే తీర్పు ఇచ్చారుట. మరో మూడేళ్ళు నా సర్వీసు పొడిగించారులే. నీ నవ్వే కావాలి అనే సినిమా వచ్చింది రేపు మొదటాటకి టికెట్స్ బుక్ చేయిస్తాను. వెళ్దాం. ఏమంటావ్?" వెకిలి నవ్వులతో అంటున్న ఆయనతో "సెలవు పెట్టడానికి వచ్చిందండీ జ్వరంగా ఉందట" అన్నాడు సూపర్నెంటుగారు. ఏం లేదూ ఈ వార్త విన్నాక ఆమెకు నిజంగానే జ్వరం వచ్చింది.

ఇంతలో ఈ వార్తవిని అందరూ వచ్చారు. హతోస్మి! ఆ గదిలో ఉన్న వాళ్ళందరికీ దిమ్మతిరిగి పడిపోయినంత పనైంది. ఎందుకంటే రాత్రి బోల్టు ఖర్చయింది. ఈ వేళ జీతాలలో కట్ అవుతుంది. అయినా ఈ శనిగాడు వదలలేదు అనుకుంటున్నారు. అయినా ఈ రాక్షసుడితో మరో మూడేళ్ళు కాపురం చేయాలి అని కొందరు అనుకుంటూంటే ఇంకొందరు వీడు మమ్మల్ని మరో మూడేళ్ళు నంజుకుతింటాడు అనుకుంటూ ఎవరి పనుల్లోకి వాళ్ళు దిగిపోయారు. అదీ సంగతి! ●

**(ఆంధ్రభూమి, వీక్లీ, 15.09.2011)**